

# ఏ గ్రంథం?

## అన్నదే ప్రశ్న

దేవుడొక్కడే అని అందరూ చెబుతారు. హిందువులు సైతం దేవుడొక్కడే గానీ ఆయన్ను అనేక పేర్లతో, రూపాలలో కొలుస్తామంటారు. దేవుడొక్కడే, నిజమే.

ఆ ఒక్క దేవుని లక్షణాలేమిటి? దేవుడొక్కడే అయితే అతని లక్షణాలు వివిధ రకాలుగా ఉండవు. నేనెవరినో మీకు తెలియనప్పుడు రకరకాలుగా ఊహాగానాలు చేస్తారు. ఒక్కొక్కరు నా గురించి ఒక్కొక్క రకంగా ఊహించి చెబుతారు. కానీ అందరూ కలిసి నన్ను ఒక్కసారి చూస్తే సరిపోతుంది. నేనెలాటి వాడినో, నా ఆకారమేమిటో అర్థమైపోతుంది.

దేవుడొక్కడే. ఆ ఒక్క దేవుడు ఎలాటివాడో వివిధ మత గ్రంథాలు వర్ణిస్తున్నాయి. ఏ గ్రంథంలో ఆ ఒక్క దేవుణ్ణి గురించిన సరియైన, సత్యమైన వర్ణం ఉంది? ఇదే కీలకమైన ప్రశ్న.

క్రైస్తవుల పవిత్ర గ్రంథం బైబిలులో దేవుణ్ణి గురించిన ఎలాటి వర్ణణ ఉంది?

1. దేవుడు సృష్టికర్త. కరుణామయుడు. మూర్తీభవించిన ప్రేమ. ఆయన మనందరికీ తండ్రి.
2. మనిషి పాపంలో పడి కొట్టుమిట్టాడుతుంటే దానికి తరుణోపాయం ఆయనే ఆలోచించాడు.
3. మనుషులంతా పుట్టుకతో పాపులేననీ, పాపులుగా జన్మించి జీవితాంతం మనసా వాచా కర్మలా వివిధ పాపాలు చేసి మరణించి, శాశ్వతంగా తనకు దూరమై నరక శిక్ష పాలవుతారనీ ఆయనకు తెలుసు.
4. ఈ దుస్థితి నుండి వారిని తప్పించాలంటే వారి పాపాలకు క్షమాపణ కలగాలి. అటుతరువాత మరణించేదాకా వారు చేస్తూ ఉండే చిన్న చిన్న పొరపాట్లకూ, పాపాలకూ కొనసాగే క్షమాపణ ఉండాలి.
5. వారిని నిర్దోషులుగా తీర్మానించడం జరగాలి. అప్పుడే మరణించాక వారు తన సన్నిధానానికి రాగలరు.
6. వారి పాపాలను తనపై వేసుకుని, వారి పాపాలకై శిక్ష తానే భరించే రక్షకుడు వారికి కావాలి. దేవుడే యేసు క్రీస్తుగా, నరావతారిగా పుట్టి మానవాళి అంతటి పాపాలకై తానే శిక్ష అనుభవించాడు.
7. ఈ సంగతిని విశ్వసించినవారికి ఆయన మూలంగా పాప క్షమాపణ, స్వర్గప్రాప్తి కలుగుతాయి.
8. యేసుక్రీస్తుపై విశ్వాసం పెట్టుకుని పాప క్షమాపణ పొందినవారికి పవిత్ర జీవనం ఉంటుంది. అలాటివారికి సాటి విశ్వాసులతో సహవాసం ఉండడం కోసం క్రైస్తవ సంఘాన్ని దేవుడు నెలకొల్పాడు.

బైబిలులో దేవుణ్ణి గురించి రాసి ఉన్నది ఇదే. బైబిల్లో కనిపిస్తున్న దేవుడు దుష్టులను సైతం ప్రేమించి సహించి క్షమించేవాడు. అందరి కోసం ప్రాయశ్చిత్తం నెరవేర్చినవాడు. ఆయన పేరు యేసుక్రీస్తు.

ప్రతి వ్యక్తికీ బైబిలు ఇచ్చే సందేశం ఇదే. యేసు క్రీస్తుపై విశ్వాసముంచు. ఆయన నీ పాపాలకై చిత్రహింసల పాలై మరణించి, తిరిగి సజీవుడై, పరలోకానికి ఆరోహణమై నేడు అక్కడ ఉన్నాడు. తనపై నమ్మకముంచమని చేతులు చాచి పిలుస్తున్నాడు.

ఎందరెందరో దేవుళ్ళు లేరు. ఉన్నది ఒక్కడే. ఆ ఒక్క దేవుణ్ణి గురించి బైబిల్లో ఇచ్చిన రమ్యమైన వివరాలు ఇవి.

నీ పాపాలకై పశ్చాత్తాపం, యేసుక్రీస్తుపై విశ్వాసం, నిర్దోషిగా దేవుని లెక్కలోకి రావడం, పవిత్ర జీవనం తదితర అంశాల గురించిన వివరాలకు మమ్మల్ని సంప్రదించండి.

ఇది మీ జీవితంలో మీరు చేసే అత్యంత ప్రధానమైన నిర్ణయం. మరణించిన తరువాత ఉండబోయే జీవితం ఈ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. మీ ఇష్టం.

**క్రైస్తవ సత్య గ్రంథశాల**
**ప్యాడిసన్‌పేట, తెనాలి-522 201**

**Christian Truth Book Room,** Paddisonpet, Tenali–522 201